ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

30.04.2024 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో పదో తరగతి వార్షిక పరీక్షా ఫలితాలు ఈ రోజు విడుదలయ్యాయి. 91.31 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బాలుర కంటే బాలికలు మెరుగైన ఫలితాలు సాధించారు.
2. లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ అగ్రనేత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ మధ్యాహ్నం మెదక్ జిల్లా అల్లాదుర్గంలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు.
3. రాష్ట్రంలో జరిగే లోక్ సభ ఎన్నికల్లో 17 స్థానాలకు మొత్తం 525 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఆదిలాబాద్ లోక్ సభ స్థానంలో అత్యల్పంగా 12 మంది, సికింద్రాబాద్ లో అత్యధికంగా 45 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.
4. రాష్ట్రంలో మరో నాలుగు రోజుల పాటు వడగాల్పుల తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఏడు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది.

పదో తరగతి- ఫలితాలు

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో 91.31 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలను విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం ఈ ఉదయం విడుదల చేశారు. ఈ ఏడాది రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి మొత్తం 5 లక్షల 05 వేల 813 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 4 లక్షల 91 వేల 862 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 91.31 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలురు 89.42 శాతం ఉత్తీర్ణత, బాలికలు 93.23 శాతం ఉత్తీర్ణత సాధించారు. దాంతో ఫలితాల్లో బాలికలదే పైచేయి అయింది. గతేడాది 89.60 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, ఈసారి 91.31 శాతానికి పెరిగింది. జిల్లాల వారీగా చూస్తే 99.05 ఉత్తీర్ణత శాతంతో ఫలితాల్లో నిర్మల్ జిల్లా మొదటి స్థానం సాధించింది. సిద్దిపేట 98.65 శాతం ఉత్తీర్ణతతో రెండో స్థానంలో నిలిచింది. వికారాబాద్ జిల్లా అత్యల్పంగా 65.10 ఉత్తీర్ణత శాతం సాధించింది. రాష్ట్రంలోని సంక్షేమ పాఠశాలల్లో 8 వేల 883 మంది విద్యార్థులు 10కి 10 జీపీ సాధించారని అధికారులు వెల్లడించారు.

(పీటీసీ, హైదరాబాద్)

నరేంద్ర మోదీ-సంగారెడ్డి

లోక్సభ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణలో బిజెపి ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ అగ్రనేత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు మెదక్ జిల్లాలో పర్యటిస్తారు. బీజేపీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్, మెదక్ నియోజకవర్గ అభ్యర్థి రఘునందన్ రావుకు మద్దతుగా సంగారెడ్డి జిల్లాలో ప్రచారం నిర్వహించనున్నారు. అల్లాదుర్గ్ లోని ఐబీ చౌరస్తా వద్ద జరగనున్న విశాల్ జనసభ కు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించనున్నారు. ఈ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు మెదక్, జహీరాబాద్ అభ్యర్థులు రఘునందన్ రావు, బిబి పాటిల్ జన సమీకరణ చేస్తున్నారు. సభా వేదిక

ఏర్పాట్లను బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమ్చంద్రారెడ్డి పర్యవేక్షిస్తున్నారు. సభా ప్రాంగణం వద్ద రెండు హెలిపాడ్లను సిద్ధం చేశారు.

(SANGAREDDY PTC)

నరేంద్ర మోదీ-వేములవాడ

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వచ్చే నెల 8వ తేదీన, బిజెపి సీనియర్ నేత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జిల్లా వేములవాడలో పర్యటించనున్నట్లు, రాజన్న సిరిసిల్ల జిల్లా బిజెపి అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ తెలిపారు. వేములవాడకు చేరుకోగానే తొలుత రాజరాజేశ్వర స్వామిని దర్శించుకుంటారని, అనంతరం ఎన్నికల ప్రచారంలో భాగంగా బహిరంగ సభలో ప్రధానమంత్రి ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

(పీటీసీ, సిరిసిల్ల)

రేవంత్ రెడ్డి-ప్రచారం

లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ మధ్యాహ్నం కరీంనగర్ జిల్లా జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన జన జాతర బహిరంగ సభలో పాల్గొంటారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు కు మద్దతుగా ప్రచారం చేస్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు రాష్ట్ర మంత్రులు సభకు హాజరు కానున్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కవ్వం పల్లి సత్యనారాయణ, హుజురాబాద్ కాంగ్రెస్ ఇంచార్జ్ - వోడితేల ప్రణవ్ ఆధ్వర్యంలో సభ ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం లోని 7 అసెంబ్లీ నియోజకవర్గలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో జన సమీకరణ చేస్తున్నారు.

(పిటిసి, కరీంనగర్)

సూర్యాపేట- జగదీశ్వర్ రెడ్డి ప్రచారం

పార్లమెంట్ ఎన్నికల తరువాత రాష్ట్ర రాజకీయాల్లో మార్పు తథ్యమని బీఆర్ఎస్ సీనియర్ నేత, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి అన్నారు. మారిన పరిస్థితుల్లో మెజారిటీ స్థానాలు బీఆర్ఎస్ కైవసం చేసుకోనున్నాయని పరిశీలకులు అంచనా వేస్తున్నారని తెలిపారు. లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా జగదీశ్వర్ రెడ్డి ఈ రోజు సూర్యాపేట రూరల్ మండలం సోలిపేట, సూర్యాపేట మున్సిపాలిటీ మున్సిపల్ పరిధిలో గడపగడపకు ప్రచారం నిర్వహించారు.

(Suryapet PTC)

జనసభలో జెపి నడ్డా

అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి బిజెపి ఎజెండా అని, మమబూబాబాద్ రైల్వే స్టేషన్ ని రాబోయే మూడు సంవత్సరాలలో విమానాశ్రయం తరహాలో ఆధునీకరిస్తామని బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా అన్నారు. మహబూబాబాద్ లోక్ సభ బిజెపి అభ్యర్థి అజ్మీర సీతారాం నాయక్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిన్న నిర్వహించిన జనసభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జెపి నడ్డా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి బిజెపి ఎజెండా అని, పేద ప్రజలకు ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా 5 లక్షల రూపాయల ఉచిత వైద్యం అందజేస్తున్నామని, రాబోయే రోజుల్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా మూడు కోట్ల ఇంట్లను నిర్మిస్తామని తెలిపారు.

పిటిసి మహబూబాబాద్

సంగారెడ్డి- హరీష్ రావు రోడ్ షో

సంక్షేమ పథకాల అమలును విస్మరించిన కాంగ్రెస్ కు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయవద్దని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే, హరీష్ రావు పిలుపునిచ్చారు. నిన్న రాత్రి సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా రోడ్ షో నిర్వహించారు.

(SANGAREDDY PTC)

EVM-Candidates:

రాష్ట్రంలోని పలు లోక్ సభ స్థానాలలో పెద్ద సంఖ్యలో అభ్యర్థులు బరిలో నిలవటంతో అదనపు బ్యాలట్ యూనిట్లను అమర్చవలసి రావటంతో అధికారులు అందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రంలోని 7 లోక్ సభ నియోజకవర్గాల్లో ప్రతి పోలింగ్ కేంద్రంలో మూడు బ్యాలట్ యూనిట్లు చొప్పున అమర్చవలసి వస్తుంది. మరో 9 స్థానాలలో ప్రతి పోలింగ్ కేంద్రంలో రెండేసి బ్యాలట్ ప్యానెళ్ళను ఉపయోగించాల్సి వస్తుంది. నోటా సహా 16 మంది పేర్లను మాత్రం ఒక బ్యాలట్ యూనిట్ పై ప్రదర్శించే అవకాశం ఉంది. దీంతో ఒక్క ఆదిలాబాద్ లోక్ సభ స్థానంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో ఒక బ్యాలట్ యూనిట్ ను మాత్రం ఉపయోగిస్తారు.

కాగా, నామినేషన్ల ఉపసంహరణ కోసం గడువు నిన్నటితో ముగియటంతో మొత్తం 525 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో అత్యల్పంగా 12 మంది అభ్యర్థులు పోటీలో నిలవగా, సికింద్రాబాద్ లో అత్యధికంగా 45 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

(MSL)

హైకోర్టు

రెండు సంవత్సరాలం క్రితం హైదరాబాద్ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేసన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రాహిల్ అరెస్ట్ పై రెండు వారాల స్టే విధిస్తూ తెలంగాణ హైకోర్టు ఈ రోజు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. రెండు వారాల తర్వాత విచారణ ఎదుర్కోవాల్సినదేనని జస్టిస్ విజయ్ సేన్ రెడ్డి బెంచ్ తీర్పు వెలువరించింది.

(హైదరాబాద్, పీటీసీ)

**వాతావరణం**

రాష్ట్రంలో మరో నాలుగు రోజుల పాటు అధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పుల తీవ్రత ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. రేపు ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో వేడి గాల్పుల తీవ్రత ఉంటుందని ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, జనగాం, సిద్దిపేట, యాదాద్రి, భువనగిరి, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట్, జోగులాంబ గద్వాల్ జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ చేసింది.

(డెస్క్)

సిరిసిల్ల-ఎండలు

వడగాలులు, ఎండ తీవ్రతతో రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వారం రోజులుగా జిల్లాలో గరిష్ఠ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవడంతో జిల్లాలో ఆరెంజ్ హెచ్చరిక కొనసాగుతోంది. జిల్లాలో కనిష్ఠ ఉష్ణో గ్రత 25.7 డిగ్రీలు, గరిష్ఠ ఉష్ణోగ్రత 43.7 డిగ్రీలుగా నమోదైంది.

(పిటిసి, రాజన్న సిరిసిల్ల)